ఆపద్బాంధవి! ఆ

జేబుగుడ్డ మాహాత్మ్య

నేను హైస్కూల్లో చదువుతూ వుండగా—

శానుభాగాజ్ఞాపకం—సుబ్బారావుగారని మా హెడ్‌మాస్టరు ఎప్పుడూ ఒక రుమాలా కోటు కుడివైపు క్రిందిజేబులో వుంచుకుంటూ వుండేవారు. నువ్వు ఆ జేబులో వుండు, నేను ఈ జేబులో వుంటాను అంటూ దానికి సహాధ్యాయినిగా ఎడమవైపు క్రిందిజేబులో ఒక ముక్కుపొడుండబ్బీ వుండేది. ఏ క్లాసు కన్నా రాబోయేముందు, చర్రున పొడుం డబ్బాలాగి, బుర్రున రెండుపట్లు పీల్చేసి, చిర్రున చీదేసి మరీ బయల్దేరేవాడు. వెంటనే అలవాటుప్రకారం ఆ చేయి అలాగే - కుడి చేయి అన్నంముద్దతోసహా ఎలా నోట్లోకి వెడుతుందో అలాగే - ఆ జేబులోకివెళ్లి ఆరుమాలాని చెవులుపిల్లిని లాగినట్లు బయటకు లాక్కొచ్చేది! దాంతో ఆయనా ముక్కుని తుడిచి, ఇంకా ఆ నాసికా సందర్భంలో ఏమైనా అనుమానంవుంటే ఆ రుమాలా అలా అడ్డంవుండగానే పనిపూర్తిజేసి దాన్ని తిరిగి స్వస్థానానికి జేర్చేవాడు. పాపం ఆయనకు ఆ జేబుగుడ్డతో అంతవరకేపని. మళ్ళీ తిరిగి దాని జోలికి పోయేవాడుగాదు అందుచేత మా ఎలిమెంటరీస్కూలు మాస్టారులా కాకుండా కొంచెం శుభ్రంగానే వుండ గలిగేవాడు

శేషగిరిగారు మా ఎలిమెంటరీస్కూలు పంతులుగారు; ఆయనస్థానం ఓ తలుపు ప్రక్కన ఏరికోరి ఆయన బల్లా, కుర్చీ అక్కడే వేయించుకున్నాడు. ఆయనదగ్గర పొడుండబ్బి బదులుగా పొడుంకాయ వుంటూవుండేది మేమంతా పిల్లవెధవలమనో ఏమో, వెనకాముందూ లేకుండా మాముందరే శుభ్రంగా కాయవంచి ఓ పావుతులందాకా ఎడంచేయి అరచేతిలో పడనిచ్చి, ఆ అర చేతిని అల్లాగేవుంచి వేళ్లసందున కాయ పెట్టి మూతపెట్టి జేబులో వేసుకోడంతోటి ప్రథమ ప్రకరణం ముగిసేది; ఆ తర్వాత చేతులో వున్న పొడుంలోంచి సగభాగం మందుతీసి రెండు నాసికారంధ్రాల్లోకి పంపించి, తిరిగి మిగిలిపోయిన దానికేసి పరకాయించిమూసి, ఇంకోపట్టులో అదంతా పీల్చి, అప్పటికీ అరచేతిలో ఏమయినా మిగిలివుంటే, ఆ అర చేతిని అమాంతం అలాగే ముక్కుదగ్గరకు పోనిచ్చి పూర్తిజేసేవారు.

దాంతో మూడవప్రకరణం ఆరంభం అయేది......తలుపు ప్రక్కనే కూర్చునే వాడని అన్నానుకదూ.. అల్లా ఆ తలుపును కొంచం వోరగానెట్టి, ఆ నాసికారంధ్రాల నుంచి ఒక పెద్ద పెనుతుపాన్ను లేవదీసేవారు. ఆ తుపానుకు—తలుపుమూలా, తెల్లటి గోడా, నల్లటి నాపరాయి,—కర్మంజాలక ఏ కుర్రాడన్నా ఆ ప్రాంతంలో వుండటం తటస్థిస్తే - వాడూ అంతా బలిఅయ్యేవారు ఆ తర్వాత, ఆ చేతికున్నది లాల్చీకి పులి మేసి ముక్కుని పంచె చెరుగుకు తుడిచే వారు. ఇలా అపరిశుభ్రంగావున్న వాళ్లకంటే మా హెడ్‌మాస్టరులాటివారు చాలా మెరుగనిపిస్తారు

ఈ రోజుల్లో జేబు రుమాలాలు కనపడని ప్రాంతాలు బహు అరుదు ఆడవారి చేతుల్లోను, మొగవారి జేబుల్లోను వాటకి ప్రత్యేకస్థానం ఏర్పడింది. పేరంటాల మొదలు పెళ్లిళ్లవరకూ అవిలేందే సాగదు. మామూలు కలహాల మొదలు ప్రణయకలహాలవరకూ వాటి ప్రభావం, పలుకుబడీ కొట్టవచ్చినట్లు కనబడుతుంది

ఉదాహరణకి—ఒకసారి ఒక చిన్న సంఘటన జరిగింది ఆరోజు సాయంత్రం ఏంతోచక అలా బీచికి షికారుకెళ్ళాను. అక్కడ నాకు ఇద్దరు తటస్థపడ్డారు. వాళ్లేదో విషయం తీవ్రంగా చర్చిస్తున్నారు. అన్నివిషయాలూ నాకు తర్వాత అవగతమయ్యాయి — వాళ్ళిద్దరికీ కలిపి ఒకతే ప్రియురాలు. వాళ్ళలో వాళ్ళకు ఒకరిమీద ఒకరికి ఏదో అనుమానమేగాని, అసలు వివరాలు ఎవరికీ తెలియవు. ఆరోజు నాకర్మకాలి వాళ్ళిద్దరూ ముఖాముఖీ తటస్థపడ్డారు. రెండవవాడు అసలు విషయం తేల్చేద్దామనో, ఏమో మొదటివాణ్ణి ఏవేవో అడిగేస్తున్నాడు; మొదటివాడు మాత్రం— ఎదటిమనిషిమీద అనుమానం వున్నా, సర్దుకుపోయే మనిషి, లేకపోతే ఆ ప్రియురాలికి వాడిమీదకన్నా తనమీదే ఎక్కువ మక్కువని వాడివిశ్వాసమో ఆ పరమాత్ముడికే తెలియాలి—తాపీగా సమాధానాలిస్తున్నాడు. అల్లా చెపుతూవున్నవాడు చెపుతూనే, ఆ ఎదటివాడు చూడకుండా మడతలతోవున్న జేబురుమాలా ఒకటి క్రింద

★ జి. శ్రీ హ

పడేసి అదికనపడకుండా దానిమీద తన బూటుకాలుపెట్టి తీరుబడిగా మాట్లాడుతున్నాడు. నేతెచిన వేళావిశేషం ఎటువంటిదో, పాపం వాడు పొరపాటున క్రింద పారేసుకుని చూడకుండా తొక్కుతున్నాడనిపించింది. దాంతోటి నా మంచితనం తెలియబర్చడానికి పెద్దమనిషిలాగా వాళ్ళ సంభాషణలో కలుగజేసుకొని—"ఏమండోయ్, మీ రుమాలా కిందబడింది. మీరు దాన్ని చూసుకోకుండాతొక్కుతున్నారు," అన్నాను అదో గొప్ప 'హీరోలా' పోజు

ప్రేంధాయిని!



టి.. కాని వాడిమొహం చూసేసరికి స్తా ఐ పి. దాఖలుచేసిన వాడి పోజు దిగింది! అల్లా నా వంక చూస్తూవున్న గ్గా తమాయించుకుని, చటుక్కున వొంగి లా చేతిలోకి తీసుకొని దులిపి ఏమీ నివాడల్లే చూడటం ఆరంభించాడు. ల్లో ఈ ముఖాల మార్పులు పరిస్థితులూ నాకు అగమ్యగోచరం అయిపోయి నాకా ఆ టైముకు నా ముఖం ఆ

8 ★

హలా తెల్లదనంతో పోటీచేస్తూ డొచ్చు.

"ఆ ఇది దాన్దే" అన్నాడా రెండో న్ని దాన్ని చూచిన వెంటనే.

ను దాన్దే ఇక్కడికెల్లా వచ్చింది! మైనా తీసుకొచ్చావా?" అన్నాడు దటివాడు ఏమీ ఎరగనట్టు.

అయిందిరా భగవాన్ దీంట్లో ఏదో ణయ రహస్యం దాగివుంది; ఎరక్కపోయి ను ఇరుక్కున్నాననుకుంటూ వుండగానే: "ఛట్.. అబద్ధం ఆడావు. నీ జేబులోంచి పడ్డదని ఆ పెద్దమనిషి చెపుతూంటే" అన్నాడు సన్నాసరా చేసుకుని ఆ రెండో వాడు; నా పెద్దమనిషితనం చట్టుబండలు గాను నిజమైన పెద్దమనిషిలాగా వెళ్లి వారిద్దరికీ లడాయి పెట్టానేమిటా అనుకున్నాను. ఇంతలో:

"ఏమయ్యోయ్"...అని సంబోధించాడు (వెధవ సంబోధన వీడూను) వాడికి ఎంత కోప మొస్తేమటుకు అలాగా పిలిచేది! కాని అది నాకు మంచిరోజు కాదుగాబట్టి నోరు మూసుకు వూరుకున్నాను .."నా జేబులోంచి పడ్డదా? నిజంగా నువ్వు చూశావా?" అని పూర్తిచేశాను.

నా పని పచ్చివెలక్కాయ గొంతు కడ్డం పడ్డట్టయింది! ఏదో లౌక్యంగా తప్పుకోవాలని "అబ్బే. ఆ రుమాలా ఎక్కడనుంచి పడ్డదో నేనయితే చూడలేదుగాని, ఆయన లోక్కడంమాత్రం చూశాను" అన్నాను. ఏదో సమాధానం దొరికినందుకు దేవుడికి మనస్సులోనే ఒక నమస్కారం పెట్టుకున్నాను.

దానిమీద ఇంకా వాళ్ళేదో ఇంకాసేపు గుంజుకున్న తర్వాత దాని సంగతి తర్వాత తేలుద్దామనుకున్నాడో ఏమో ఆ రెండో వాడు అక్కడనుంచి కస్సుబుస్సుమంటూ వెళ్ళిపోయాడు.

మొదటివాడుమాత్రం తిన్నగా పోక, "ఏమయ్యోయ్! ఇలాటి వ్యవహారాల్లో కలగజేసుకుంటే మర్యాద దక్కదని" గద్దించి వెళ్ళిపోయాడు. భగవంతుడి దయవల్ల ఇంతటితో పోయిందని సంతోషించి బయటపడేసరికి తలప్రాణం తోకకొచ్చింది! ఇదంతా ఆ జేబురుమాలా మూలంగానే వచ్చిందికదా అనుకున్నాను. ఇప్పటికీ, ఆ రుమాలా ఒక మూల వ్రాసివున్న ఏవో అక్షరాలు—(అవి ప్రేయసీప్రియుల పేర్లుగాబోలు)—ఇంకా కళ్ళలో మెదులుతూవున్నాయి!

ఈలాటివి ప్రపంచంలో ఏ మూలనో ఓమూల జరగడం కద్దు.

నవలల్లో హంతకులు ఎవరినైనా ఎత్తుకుపోయేముందు, క్లోరోఫారం వాసన చూపడానికి అనువైనసాధనం జేబురుమాలా!

ప్రియుడు ప్రియురాలికిగాని, లేక ప్రియురాలు ప్రియుడికిగాని కానుకగా చదివించుకోడానికి తేలికవస్తువు జేబురుమాలా!

రోడ్డు రోమియోల (ఆ మధ్య ఏవనితో పేర్కొన్నట్టు) చేతుల్లోనో, లేక కాలర్ కు మెడకు మధ్యగానో కనబడే వస్తువు జేబురుమాలా!

పోకిల్లా స్త్రీటుజాలియట్లు (ఓ పెద్దమనిషి ఆ మధ్య పేర్కొన్నట్టు) తమ మూతికి అడ్డంగా పెట్టుకునో, లేక చేతులో ఊపుతూనో ప్రదర్శించే విలాస వస్తువు జేబురుమాలా!

సైకిలు తొక్కుతూ తెల్లపాంటు ఎక్కడ మాసిపోతుందోనని సీటుమీద ఒకటీ, స్వేద బిందువులతో ముఖం ఎక్కడ జిడ్డోడుతుందోనని జేబులో మరొకటిపెట్టు ఆప్తబాంధవి జేబు రుమాలా! శ్రావణ మాసంలో పక్కింటి పేరంటానికి వెళితే వాళ్ళిచ్చే శనగలనూ, అరటిపళ్ళనూ భద్రంగా మూటకట్టి తెచ్చుకోడానికి పనికివచ్చే అమూల్యసాధనం జేబు రుమాలా! వెంట వచ్చే ప్రతి పిల్లకూ ఒక్కొక్క జేబు రుమాలా అంటకడితే ప్రతిఫలం ఇబ్బడీ, ముబ్బడీ!

ఇలా అనేక విధాలుగా మన చేతిగుడ్డల ప్రాముఖ్యం పెరిగిపోయిందని వేరే చెప్పాలా?

రుమాలా జేబులో వుందనుకుని అలా ఏ పార్కులోకో షికారు కెళ్లేటప్పుడు ఏ వేరుశనక్కాయల బండో, బఠానీల బండో, కనబడితే, పార్కులో కాలక్షేపం కోసం మూడు నయాపైసలు పారేసి అవి కొనుక్కుందా మనుకుంటే జేబులో రుమాలా లేకపోతే ఎంత ఆశాభంగం చెందుతామో ఊహించండి!

అలాంటి పరిస్థితిలో పక్కనే ఏ చేనేత వస్త్రాలయమో కనబడితే వెంటనే దూరి అమాం

★ ఆపద్బాంధవి! ఆప్తసంధాయిని! ★

తం ఏ డజనో, అరడజనో రుమాళ్ళు కొనుక్కొని అనుకున్నపని ముగించేవాళ్ళుకూడా ఈ రోజుల్లో చాలామంది వున్నారు. తన రుమాలా అయితే ప్రాణప్రదంగా చూసుకుంటూ, అదే ప్రియురాలి మహాప్రసాదం అయితే మరింతగా జాగ్రత్తపడే పై మెట్టు పెద్దమనుషులూ వున్నారు.

అసలు జేబురుమాలాల ఆరంభం ఏ దేశంలోనో, దాన్ని కనిపెట్టింది ఎవ్వరో, పుట్టుపూర్వోత్తరాలేమిటో.. ఈ వివరాలన్ని ఆలోచించే ఓపికగాని, పరిశీలించే శక్తిగాని నాకు లేదు. కాని నేను చెప్పేదేమంటే... ఎప్పుడైతే ఈ నాసికాచూర్ణం ఉద్భవించిందో, దానివెనకాలే అది ఆవిర్భవించి వుంటుందని నా నమ్మకం. ఆ రెంటికీవున్న అవినాభావ సంబంధం అటువంటిది మొదటి రోజుల్లో ముక్కులు, మూతులూ తుడుచుకోటానికి ఏ పాతగుడ్డ పేలికో జేబులో వేసుకోడంతో ప్రారంభం అయివుంటుంది దీనిగాథ.

దాని పరిహాదులు సరిగా వుండకపోవడంచేత, జీవితం ఇట్టే హరించిపోతుందేమోనన్న భయంకొద్దీ దాని అంచులు కుట్టించే ఆచారం వచ్చివుంటుంది. ఆ తర్వాత క్రమేపీ పాతగుడ్డలకుబదులు, కొత్త గుడ్డలనుంచే ముక్కలు చించడం, వాటి అంచులు కుట్టించడం, ఆ అంచులనే రంగు దారాలో కుట్టి నగిషీ చేయించడం, మూలల్లో పేర్లు కుట్టించడం, మధ్యలో లతలు, పూలు కుట్టడం—ఇవేమీ సయించని శుద్ధ నిర్గుణ బ్రహ్మలు వూరికే అల్లా సాదాగా వదిలివేయడం - పద్ధతి అయింది. వీటిలోనే లేడీ ఫాషన్‌లూ, జంటిల్‌మన్ ఫాషన్‌లూ అవతరించాయి.

ఈవిధంగా ఈనాడు జాతీయ, అంతర్జాతీయ ప్రజాజీవితంలో ప్రముఖస్థానము పొందుతున్నది జేబురుమాలా. జేబు రుమాలాలను ఇంట్లో పదిమంది వాడడం ఎప్పుడైతే ఎక్కువైందో, చాకిరేవుకేసే గుడ్డల జాబితాలో వాటికి ప్రముఖస్థానం లభ్యమైంది.

షాపుల్లోకి వెళ్ళి, చీరలు పంచలూ, ఉత్తరీయాలు, చొక్కాగుడ్డలు, లాగూ గుడ్డలూ కొనదలచిన వాళ్లు చివరిబేరంగా జేబు రుమాళ్ళనుకూడా కొనకుండా వుండరు.

కొంచెం దూరంగా వున్న మేడలలోంచి "నేనిక్కడ, నువ్వెక్కడా హా, హతవిధీ" అని బాధపడే ఇద్దరు ప్రణయజీవుల మధ్య రాయంచల్లాగా రాయబారాలు నడుపుతూ సాంకేతికాలు అందజేస్తూ తెల్లగా వాళ్ళ చేతులలో అలాఅలా వూగుతూ మూగసంభాషణలు చేయించే పుణ్యం ఈ జేబు రుమాళ్ళకే దక్కింది.

రైల్వే ప్లాటుఫారాల మీద రైలు కదిలే సమయంలో ఒకసారి కిందికీ మీదికీ పరికిస్తే చాలు—ఈ రుమాలాల ప్రాధాన్యం అర్థమవుతుంది. అప్పటివరకు ఎదురెదురుగా వున్న ఇద్దరు ఆప్తులను అకస్మాత్తుగా వేరుచేస్తున్న బండగుండె రైలుబండిబయల్దేరినతరువాతకూడా నిమిషాలపాటు వాళ్ళహృదయాలను మహాగాఢంగా బంధించివేయగలిగిన మహద్భాగ్యం వీటికే దక్కింది.

సినిమాహాల్లో కూచుంటే (ముఖ్యంగా వేసంగిరోజుల్లో..) ఆ జేబురుమాలా ఉపయోగం ఇంతింతని చెప్పడానికి వీల్లేదు అదే మనదగ్గర లేకపోతే, హాల్లో కూర్చునే ప్రాప్తివుండదు. ఒకవేళ మొండికెత్తి కూర్చున్నా సినిమా పూర్తయేసరికి నీళ్ళు గారుతూ జీవచ్ఛవంలా బయటపడవలసిందే ముందు జాగ్రత్తపడి ఒక రుమాలా జేబులో వేసుకుని హాల్లోకివెడితే, అటు విసురుకోడానికి, ఇటుతుడుచుకోడానికీ, ఇంటర్వెల్‌లో బయటికి వచ్చినప్పుడు ఏ కాలక్షేపం బటానీలో కొనిపోసుకోడానికి ఇలాగేఎన్నెన్నో అవసరాలకు ఆపద్బాంధవిలా ఉపయోగపడుతుంది.

ఆనాడు శ్రీకృష్ణభగవానులు భార్యారత్నాలతోకూడి చెలాకీగా చెరుకువిందు చేసుకుంటూన్నప్పుడు పొరపాటున చేయి తెగితే అదేసమయానికి పేరంటం పిలవడంకోసం (ఆయన్నికాదు) అక్కడకు విచ్చేసిన ద్రౌపది ఆ దృశ్యంచూసి అమాంతం తన విలువైన చీరచెరుగు చించి ఒక పేలికను కృష్ణుడివేలికి చుట్టింది!

ఆరోజుల్లోనే ఈ జేబురుమాలపద్ధతి వున్నట్లయితే ఈలాటి ప్రథమచికిత్సలకు అడ్డుపడడమేగాక పండంటి ద్రౌపతి చీరె అలా పాడైవుండేది కాదుగదా అనిపిస్తుంది.

దానాలన్నింట్లోకి అన్నదానం, వస్త్రదానం చాలా గొప్పవని మన పెద్దలంటారు. ఈనాటి పెళ్ళిళ్ళలో అన్నదానం కొద్దో గొప్పో ఎలాగూ జరుగుతోంది ఈ జేబురుమాలాలు వస్త్రదానం సమస్యనుకూడా కొంతవరకు తీర్చేస్తున్నాయి. కర్పూరపు కడ్డీలతోపాటు చేతిరుమాళ్లుకూడా పంచిపెట్టడం పరిపాటయింది.

ఇలాగా ఈ రోజుల్లో జేబురుమాలా మంచికీ చెడుకూ మనకు బాగా ఆసరా అవుతున్నది. దాని మూలానే ఇంతసెంటు కొడుతున్నాం; దానిమూలానే ఇంత నాసికాచూర్ణంకూడా కొడుతున్నాం! దాంతోనే ప్రియులమధ్య ప్రణయాలు సాగుతున్నాయి; దాంతోనే ప్రియులమధ్య కలహాలు సంప్రాప్తమవుతున్నాయి! ఇలా జేబు రుమాలా అన్నది రకరకాలగా ఉపయోగపడుతున్నది.

ఈరోజు అది కనపడని తావులేదు. బీచిలో, పార్కులో, ప్లాట్‌ఫారంమీద, సైకిల్‌పందాల్లో, గుర్రపుపందాల్లో శ్రావణమాసం పేరంటాళ్ల చేతుల్లో,-ఇంకా ఇంకా అనేక స్థలాల్లో ప్రత్యక్షమవుతున్నది.

ఇలాగా ఉడతాభక్తిగాగాని, ఉన్నత స్థాయిలోగాని ప్రజానీకానికి తరతమ భేదం లేకుండా అన్నివిధాలా ఆసరాగా వుండి ప్రపంచాన్ని ముందుకు తీసుకువెళ్ళడానికి జేబురుమాలాతోడ్పడుతోందని నావిశ్వాసం.

దీన్నిగురించి ఇంత వివరించేసరికి నా నుదురంతా చెమటతో తడిసిపోయింది...ఉండండి రుమాలాతో తుడుచుకొస్తా! ★



* ఇనుప పెట్టెలు * బీరువాలు

* క్యాషుబాక్సులు * ఆఫీసురాక్సు

ముప్పది సంవత్సరములుగా నాణ్యమునకు, మన్నికకు, సరసమైన ధరలకు ప్రసిద్ధిచెందినవి.

లల్లూరాం అండ్ కో

(స్థాపితము 1928)

(H. O) వెలగలేటివారి వీధి, విజయవాడ - 1.

(బ్రాంచి) 2/156, బ్రాడ్వే, మద్రాసు - 1.

క్రొత్త షోరూమ్ మారుతీ సినిమా కెదురుగా.

NVKR, VZA.

అధైర్యపడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX—ADVICE పొందవచ్చును మీకు ఉండుకొన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది

డాక్టర్ రత్నంసన్స్, (Estd 1904)

మలకపేట బిల్డింగ్సు, హైద్రాబాద్ - 2 (దక్కన్)